క్లుప్తంగా

చార్జ్‌షీట్ల దాఖలుపై సమీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆధ్వర్యంలో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసుల దర్యాప్తు, చార్జ్‌షీట్ల దాఖలు అంశాలపై పోలీసు అధికారులతో న్యాయమూర్తి గంధం సునీత సమీక్ష జరిపారు. ఖైదీలకు బెయిల్, ష్యూరిటీలు సంబంధించి ఎదురవుతున్న సమస్యలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించి అధికారులకు తగిన సిఫార్సులు చేశారు. ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చేపడుతున్న కార్యక్రమాలు, బాధితుల పరిహారాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎస్కే జానీ బాషా, జిల్లా ఇన్‌చార్జ్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి బి.పద్మ, జిలా అడిషనల్ ఎస్పీ ఎంబీఎస్ మురళీకృష్ణ, కాకినాడ సీఐ ఆర్.రవికుమార్, జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, గవర్నమెంట్ ప్లీడర్, జిల్లా డీఆర్‌టీ సీతారామమూర్తి, సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



పరీక్షలో ప్రతిభ కనబరిచిన శ్రీచైతన్య విద్యార్థులు

కంబాలచెరువు: ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ ఒలింపియాడ్‌లో 156 మంది స్థానిక శ్రీచైతన్య విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ సీహెచ్ సౌజన్య తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయ బృందాన్ని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం సురేష్, రాజమహేంద్రవరం ప్రాంతీయ అధికారి ఉదయ్‌శంకర్ బుధవారం అభినందించారు. ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగర రీజియన్‌లో అత్యధికంగా 450 పైన విద్యార్థులు ఉత్తీర్ణత చెందారని అన్నారు. దీనికి ఐపీఎల్, సీ బ్యాచ్, టెక్నో వంటి ప్రతిష్టాత్మక ప్రోగ్రామ్స్ కారణమన్నారు. కోఆర్డినేటర్ కిరణ్ పాండే, ఇన్‌చార్జులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో అన్నసమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న గొందేశి శ్రీనివాసులరెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు బాలాజీపేటలోని శ్రీవిజయ కనకదుర్గమ్మ ఆలయం వద్ద దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం భారీ అన్న సమారాధన జరిగింది. తొలుత దీనిని న్యాయవాది, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి అర్చన, విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణికుమార్‌శర్మ అమ్మవారికి మహా నైవేద్యాన్ని సమర్పించి, కర్పూర హారతి ఇచ్చారు. కార్యక్రమంలో వాసంశెట్టి సూర్యగణేష్, తలారి శ్రీనివాస్, సూరంపూడి ప్రకాష్, వడ్డీ రాజా, జీపీఆర్ నాయుడు, సాగర్ కిరణ్‌ప్రభ, యలవర్తి నాగేంద్ర, దుర్గాప్రసాద్ రాజు, కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మురళికి పరామర్శ



మురళిని పరామర్శిస్తున్న తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అనారోగ్యంతో ఉన్న ఉమ్మడి రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జోకల మురళిని బుధవారం తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పరామర్శించారు. తొలుత రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ హర్షకుమార్‌ను ఆలయ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి కాకినాడ తరలివెళ్లారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పీసీసీ సభ్యులు బోడా వెంకట్, సత్తి సందీప్, ముళ్లమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



కాతేరులో చెట్ల మధ్య నుంచి వెళుతున్న 33 కేవీ విద్యుత్ లైను



చెట్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు



విద్యుత్ తీగలు కనిపించకుండా..

● ఆపాద చూడండి

విద్యుత్ వినియోగం నిత్య జీవితంలో కీలకమైంది.. ఈ విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అదేస్థాయిలో ప్రమాదం జరుగుతోంది.. అయినా అధికారులకు పట్టడం లేదు. కాతేరు గ్రామంలో చాగల్నాడు ఎత్తిపోతల పథకానికి 33 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుంది. అయితే ఆ తీగలు చెట్ల మధ్య నుంచి ఉన్నాయి. చెట్ల పొదల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు సైతం కనిపించడం లేదు. వర్షం వస్తే ఈ చెట్లకు విద్యుత్ సరఫరా వచ్చి ఎక్కడ గేదెలు చనిపోతాయోనని స్థానిక పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఒక గేదె విద్యుత్ తీగ వల్ల మృత్యువాత పడిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను కమ్ముకున్న చెట్ల పొదలను తొలగించి, ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– రాజమహేంద్రవరం రూరల్

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



క్యాన్సర్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న డాక్టర్ నితిన్

అనపర్తి: స్థానిక ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) అనపర్తి, బిక్కవోలు మండలాల ఆధ్వర్యంలో బుధవారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రాజమహేంద్రవరం డెల్టా హాస్పిటల్‌కు చెందిన శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ రిమ్మలపూడి నితిన్, క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ మండవ పాల్గొని పీఎంపీలకు అవగాహన కల్పించారు. డాక్టర్ నితిన్ మాట్లాడుతూ క్యాన్సర్‌కు సంబంధించి రోబోటిక్ విధానంలో అతి తక్కువ రక్తస్రావంతో, అతి తక్కువ నొప్పితో చికిత్స అందించవచ్చని తెలిపారు. క్యాన్సర్ వైద్య నిపుణుడు సుమంత్ మండవ మాట్లాడుతూ పర్యావరణం, జీవనశైలిలో మార్పులు, ప్లాస్టిక్ వినియోగం సంబంధిత కారణాలతో 80 నుంచి 90 శాతం మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. పీఎంపీల మండల అధ్యక్షుడు వాసంశెట్టి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి డి.సాయిరామారెడ్డి, కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్, రాయవరం మండల అధ్యక్షులు ఎన్వీ రమణ, క్రాంతి కుమార్, ఎస్ఎస్ చలం, పీబీ సుబ్రహ్మణ్యం, పీటీఎల్ నారాయణ, కేఎస్ఎన్ మూర్తి, ఎన్.నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో మేలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: సమాచార హక్కు చట్టంతో సమాజానికి మేలు జరుగుతుందని రూరల్ తహసీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం హుకుంపేటలో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం ఆధ్వర్యంలో ఆర్‌టీఐ 2005 చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాదం శివన్నారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఏ ప్రభుత్వం కార్యాలయంలోనైనా అవినీతి జరిగితే అధికారులు దృష్టికి తీసుకు రావాలన్నారు. జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీహెచ్ సుమిత్రానందన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రూపస్ కుమార్, ప్రొఫెసర్ ఝాన్సీ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో 2005 ఆర్‌టీఐ చట్టం సమాచార బోర్డులు ఉండేటట్టు చూడాలని కోరారు.

బురద చల్లడం ఈవీఎం ఎమ్మెల్యేకు అలవాటే

- వైద్య కళాశాలలను కాపాడుకుందాం
- మాజీ ఎంపీ భరత్‌రామ్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్ తదితరులు

సీటీఆర్ఐ: ఆధారాలు లేకుండా బురద చల్లడం ఈవీఎం ఎమ్మెల్యేకు అలవాటేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఇచ్చిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను స్థానిక మార్గాని ఎస్టేట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ వైద్య కళాశాలలు ప్రజల ఆస్తి అని, వాటిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల తరఫున పోరాడుతున్నారని, అందరూ సంఘీభావం తెలుపుతూ సంతకాలు చేయాలని కోరారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని అన్నారు. తాను అన్ని పనులపై కమీషన్లు తీసుకున్నట్లు ఎన్నికల ముందు ఇప్పటి ఎమ్మెల్యే కరపత్రాలు పంచి దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఎందుకు నిరూపించలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు పేపర్‌మిల్లు వ్యవహారంలో కూడా తనకేదో సూట్ కేసులు అందాయని అనడం శోచనీయమన్నారు. ఆధారాలు ఉంటే బయట పెట్టాలని సవాల్ విసిరారు. ఐదేళ్ల కిందట పేపరుమిల్లు కార్మికులకు ఈవీఎం ఎమ్మెల్యే ఎన్నో ప్రగల్భాలు పలికి రూ.5,800 అగ్రిమెంట్ మాత్రమే ఎందుకు చేశారని అన్నారు. ఇప్పుడు ఒక్క రూపాయి అయినా ఎక్కువ అగ్రిమెంట్ చేయాలి కదాని ఆయన ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ హయాంలో మేనేజ్‌మెంట్‌ను ఒప్పించి రూ.6,500 చేస్తామంటే, ఎందుకు అడ్డుకున్నారని భరత్‌రామ్ నిలదీశారు. ఇక ఆదిరెడ్డి అప్పారావు కూడా ఏదేదో మాట్లాడి, మరి ఇప్పుడు చేసిన అగ్రిమెంట్ ద్వారా మేనేజ్‌మెంట్‌కు రూ.కోట్లు మిగిల్చి సూట్ కేసులు పట్టుకెళ్లినట్టు కాదా అని వ్యాఖ్యానించారు. మోసం చేశానని తనపై ఆరోపణలు చేస్తున్నారని, నిజానికి రూ.6,500 అగ్రిమెంట్ చేస్తానంటే, అడ్డుకుని, అంతకంటే తక్కువకు అగ్రిమెంట్ చేయడం మోసం కాదా అని నిలదీశారు. తాను ఆస్తులేమీ కొనలేదని, ఉన్నవి అమ్ముకున్నానన్నారు. నగరంలో బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలు మితిమీరిపోతున్నాయని భరత్‌రామ్ ఆరోపించారు. సుబ్రహ్మణ్య మైదానంలో నిద్రపోతున్న వృద్ధుడిపై బ్లేడ్‌లతో దాడి చేయడం దారుణమని అన్నారు. ఇంత ఘోరంగా నగరంలో వ్యవస్థను పాడుచేశారని మండిపడ్డారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

రాజమహేంద్రవరం రూరల్: తన భర్త కనిపించడం లేదని లాలాచెరువు స్పిన్నింగ్‌మిల్లు ప్రాంతానికి చెందిన కోరాడ విజయభారతి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కోరుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జీఎంఎస్‌కేగా విజయభారతి పనిచేస్తుంది. తన భర్త విజయకుమార్ స్నేహితునికి ఫోన్ చేసి సూసైడ్ చేసుకుని చనిపోతానని చెప్పినట్లు, అప్పటి నుంచి కనిపించడం లేదని విజయభారతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి



అబ్దుల్ కలాం సూక్తుల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవకుమారి తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి, ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చెప్పిన సూక్తులను పుస్తక రూపంలో తీసుకొచ్చి వాటిని అన్ని విభాగాలకు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాఘవకుమారి మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఏటా అక్టోబర్ 15న ప్రపంచ 'వరల్డ్ స్టూడెంట్స్ డే' జరుపుకొంటున్నామన్నారు. కలాం ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ పీఎస్ఎస్ఎన్ దుర్గాప్రసాద్, అధ్యాపకులు జేఆర్ ఠాగూర్, బి.జానకి, ఎ.శ్రీలక్ష్మి, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తదితరులు హాజరయ్యారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఆర్ట్స్ కళాశాలలో..

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల భౌతిక, రసాయన శాస్త్ర, మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో భారతరత్న అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. దీనికి హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ డాక్టర్ కలాం చూపిన మార్గంలో యువత శక్తి నడవాలన్నారు. కలాం చిత్రపటానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నృత్యం...నయన మనోహరం



నాట్యాచారుడు హరిరామమూర్తిని సత్కరిస్తున్న ప్రముఖులు



శ్రీరాధాకృష్ణ కళా క్షేత్రంలో లక్ష్మీదీపిక నృత్యాభినయం



విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో నాట్యం చేస్తున్న కళాకారులు

సీటీఆర్ఐ: గోదావరి తీరం నృత్య ప్రదర్శనలతో ఎగసిపడింది.. ఆహూతులకు నయన మనోహరంగా మారింది.. దీనికి స్థానిక విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల వేదికైంది. వెంపటి చినసత్యం జయంతిని పురస్కరించుకుని ప్రపంచ కూచిపూడి నృత్య దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు నృత్య పాఠశాలల విద్యార్థులు పలు కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత నాట్యాచార్య భాగవతుల మోహనరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు కూచిపూడి నృత్యంతో అలరించారు.

అనంతరం విశాఖపట్నం కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, ప్రముఖ నఖ చిత్రకారుడు రవి పరస, చిత్రకారుడు బాపిరాజు, చిత్ర కళాకారిణులు రాధారాణి, లక్ష్మి తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాధాకృష్ణ కళాక్షేత్రంలో ప్రపంచ కూచిపూడి నృత్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాక్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ మాట్లాడుతూ కూచిపూడి నృత్యం గురించి నేటితరం తెలుసుకోవాలనే సంకల్పంతో 63 రోజుల పాటు 22 రాష్ట్రాలు, 17 వేల కిలోమీటర్లు ప్రయాణించి దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ భగీరథ ప్రయత్నాన్ని 2003లో తలపెట్టామన్నారు.

భారతీయ జ్ఞాన పునరుజ్జీవమే ప్రపంచానికి మార్గదర్శి



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు

సీటీఆర్ఐ: భారతీయ జ్ఞాన పునరుజ్జీవమే సమగ్ర శాంతికి, సమతుల్యతకు మార్గదర్శి అని గేల్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ రావు అన్నారు. స్థానిక ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రాచీన భారత జ్ఞాన పునర్జీవనం ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఒక నిధి అనే అంశంపై వివిధ విశ్వ విద్యాలయాలకు చెందిన ఆచార్యులు, పరిశోధకులు, ఆధ్యాత్మికవేత్తలు తమ అభిప్రాయాలను, 125 గోష్ఠి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సమావేశంలో, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీవీ తిరుపన్యం మాట్లాడుతూ సదస్సు విజయవంతం కావడానికి సహకరించిన ఆచార్యులు, పరిశోధకులకు కృతజ్ఞతలు తెలిపారు. గేల్ ఇండియా, ఎల్ఐసీ, వివిధ రకాలుగా సహాయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన గేల్ ఇండియా లిమిటెడ్ డివిజనల్ మేనేజర్ హెచ్ఆర్ దివి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రాచీన భారత విజ్ఞానం గతం కాదని భవిష్యత్తుకు దారి చూపే జ్ఞాన జ్యోతి అని అన్నారు. ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. ఖగోళ శాస్త్రంపై చీమలమర్రి శ్రీనివాసరావు, నాట్య శాస్త్రంపై దుర్గాప్రసాద్, ఆయుర్వేదంపై డాక్టర్ సూర్య రఘురాం, ఏన్షియంట్ ఇంజినీరింగ్ టూల్స్‌పై ఆచార్య భాస్కర్‌మూర్తి, ఇండియన్ పెయింటింగ్‌పై ఆచార్య కిరణ్ క్రాంత్‌చౌదరి, ఏన్షియంట్ మ్యాథమెటిక్స్‌పై ఆచార్య జి.వెంకట్రావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి అప్పారావు, డాక్టర్ వైస్ స్వర్ణశ్రీ, డాక్టర్ పసుపులేటి శ్రీరామ్మూర్తి, డాక్టర్ డీవీ రమణమూర్తి, డాక్టర్ పీవీబీ సంజీవరావు, మధులత లలిత రమ్యశిల్ప, ఎం.సోని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి చేతుల మీదుగా విదేశీ విద్యార్థులకు స్టూడెంట్స్‌కి ప్రశంసా పత్రాలను అందజేశారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థులకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పిస్తున్న మ్యాజిక్ బస్ యూత్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం చేయవచ్చని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కె.కనకరాజు అన్నారు. బుధవారం బొమ్మూరు వైటీసీ ప్రాంగణంలో మెప్మా ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే నిర్వహించారు. చేతుల శుభ్రత ప్రాధాన్యంపై మెప్మా సిబ్బంది అవగాహన కల్పించారు. మెప్మా పీడీ కనకరాజు మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధుల నుంచి మనం, మన కుటుంబ సభ్యులు రక్షించుకోవాలంటే రోజువారీ జీవితంలో చేతులు శుభ్రం అత్యంత అవసరమన్నారు. మెప్మా జిల్లా టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ ఫణికుమార్, శ్రీదేవి, రాజమహేంద్రవరం సిటీ మిషన్ మేనేజర్ రామలక్ష్మి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోకపోతే అనారోగ్యానికి గురవుతారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టాఫ్ సెక్రటరీ డి.రాముడు, పీఈటీ ఉమారాణి తెలిపారు. శాటిలైట్‌సిటీలో జెడ్పీ హెచ్ఎస్‌లో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోజనం చేయక ముందు, టాయిలెట్స్ ఉపయోగించిన తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. మ్యాజిక్ బస్ యూత్ సభ్యులు టి.మరియ, భువనేశ్వరి, కె.మార్త, స్కూల్ ఇన్‌చార్జి జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజుకు పరామర్శ



త్యాగరాజును పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బొమ్మూరుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి యెనుముల త్యాగరాజును బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. త్యాగరాజుకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు తాటికొండ విష్ణు, ముద్దాల అను, నాయకులు కేవీ సుబ్బారెడ్డి, తోడేటి రాజా, రవీంద్ర, తోడేటి రాహుల్, మోషే పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల హక్కులు కాపాడాలి



రాజమహేంద్రవరంలో ధర్నా చేస్తున్న తపాలా ఉద్యోగులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తపాలా ఉద్యోగుల హక్కులను కాపాడాలని, ఇటీవల అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించిన ఆల్ ఇండియా కార్యదర్శి ఎస్ఎస్ మహాదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డివిజనల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యు.రవిప్రకాష్ డిమాండ్ చేశారు. అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు బుధవారం రాజమహేంద్రవరం సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎదురుగా ఉద్యోగులంతా ధర్నా నిర్వహించారు. బలవంతపు టార్గెట్లను తొలగించాలని, కార్యదర్శి మహాదేవను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తపాలా ఉద్యోగుల సంఘ కార్యదర్శి వైమర్ రెడ్డి, రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు పి.దుర్గారావు, స్వర్ణరాజు, జీడీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బీవీ రమణ, కోశాధికారి పి.శ్రీనివాస్ రామచంద్రపురం ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్‌వీ మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వరరావు సేవలు చిరస్మరణీయం



అద్దగర్ల కామేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దేవదాయశాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా దివంగత అద్దగర్ల కామేశ్వరరావు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. స్థానిక హోటల్ షెల్టాన్‌లో అద్దగర్ల కామేశ్వరరావు పెద్దకార్యం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కామేశ్వరరావు కుమారుడు అద్దగర్ల జగన్‌బాబును పలువురు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు ఆకుల వీర్రాజు, రౌతు సూర్యప్రకాశరావు, ఏపీ ఐసీసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ యువజన విభాగ నేత జక్కంపూడి గణేష్, సినీ దర్శకుడు కురసాల కల్యాణ్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, నందెపు శ్రీనివాస్, బోణం సతీష్, ఎస్‌డీఆర్ ధనరాజు, బొరుసు ఉదయభాస్కర్ తదితరులు సంతాపంలో తెలిపిన వారిలో ఉన్నారు.